| | | |
|---|---|---|
| **పప్పెట్రీ రకం** | : | తొడుగులు |
| **అంశం** | : | గణితం |
| **సామర్థ్యం** | : | 1 నుండి 10 వరకు అంకెలు,పరిచయం |
| **తొడుగులు** | : | చిలుకలు –10 |
| **కావలసిన వస్తువులు** | : | చార్ట్ పేపర్ లేదా పేపర్ ప్లేట్ , జిగురు , రంగులు,దారం. |
| **తయారీ విధానం** | : | చార్ట్‌ను గుండ్రగా కత్తిరించాలి. చిలుక పచ్చ రంగు ను వేయించాలి. ముక్కు, కళ్లు ఆకారంలో చార్ట్ పేపర్‌ను కత్తిరించి అంటించాలి. దారంతో పిల్లల ముఖాలకు కట్టాలి. |
| **నిర్వహణ విధానం** | : | 10 చిలుకలు పాడుచుండగా – పాడలేక ఒకటిపోతే మిగిలే 9<br>9 చిలుకలు తుమ్ముచుండగా – హాచ్ హాచ్ హాచ్ తుమ్మలేక ఒకటి పోతే మిగిలె 8<br>8 చిలుకలు ఎగురుచుండగా ఎగరలేక ఒకటిపోతే మిగిలె 7 (ఏడు)<br>7 చిలుకలు ఏడ్చుచుండగా ఏడ్వలేక ఒకటిపోతే మిగిలె 6<br>6 చిలుకలు ఆడుచుండగా ఆడలేక ఒకటి పోతే మిగిలె 5<br>5 చిలుకలు కలిసిఉండగా ఉండలేకపోతే మిగిలె 4<br>4 చిలుకలు నవ్వుచుండగా – హి–హి–హి–హి నవ్వలేక ఒకటి పోతే మిగిలె 3<br>3 చిలుకలు మూల్గుచుండగా – ఊ...ఉ....ఊ....ఊ..మూల్గలేక 1 పోతే మిగిలె 2.<br>2 చిలుకలు జంటగుండలేక 1 పోతే మిగిలె 1 చిలుక ఒంటరిగా ఉండలేక ఎగిరిపోతే మిగిలె 0.... మిగిలె సున్నా – మిగిలెసున్నా – మిగిలెసున్నా. గేయాన్ని ..... |
| **సూచనలు** | : | ఆరోహణ, అవరోహణ కూడ బోధించవచ్చు.<br>1 నుండి 10 దాక అంకెలను కూడ చార్ట్ పేపర్ తో కత్తిరించి పిల్లల నడుములకు ఒకొక్క చిలుక వెళ్లిపోతుంటే వారికి అంకెలు తెలుస్తాయి. |



పప్పెట్రీ రకం : తొడుగులు



అంశం : తెలుగు

పాఠం : పలక

సామర్థ్యం : గేయం–స్నేహం, సంతోషం.

కావలసిన తొడుగులు : చిలక, పావురాయి

ఇతర వస్తువులు : పండు, పలక, పుస్తకం.

కావలసిన వస్తువులు : చార్ట్ పేపర్ లేదా పేపర్ ప్లేట్ ,చార్ట్ , జిగురు , దారం,రంగులు

తయారీ విధానం : పేపర్ ప్లేట్ లేదా చార్ట్ ను గుండ్రగా కత్తిరించాలి. చిలుకపచ్చ రంగును వేయించాలి. ముక్కు కళ్లు ఆకారంలో చార్ట్ పేపర్‌ను కత్తిరించి అంటించాలి. అలాగే పావురాయిని తయారుచేయాలి. దారంతో పిల్లల ముఖాలకు కట్టాలి.

నిర్వహణ విధానం : ఒక అమ్మాయి చదువుకుంటూ ఉంటుంది.పక్కన పలక, పండు ఉన్నాయి. పావురాయి (తొడుగు వేసుకున్న విద్యార్థి) వచ్చి పండును తీసుకోవాలని చూస్తూంది. అమ్మాయి పావురాయిని తరముతుంది. (తరగతిగదిలో ఒకరివెంట ఒకరు పరిగెత్తాలి.) పావురాయి పలకను ఎత్తుకుపోతుంది. అమ్మాయి, పలకను వెతుకుతూ చిలక (తొడుగు వేసుకున్న విద్యార్థి) ను చూసి 'చిట్టిచిలకమ్మ పలక ఏదమ్మ ? ' అని అడుగుతుంది. చిలక అటుఇటు చూసి 'పావురాయి, పావురాయి' (సన్నగొంతుతో) అని అంటుంది. అమ్మాయి : 'పావురాయి పట్టుకెళ్లిందా ? ఎగిరి పోవమ్మ పలక తేవమ్మ! పలక నాకమ్మ. పండు నీకమ్మ! ' అని అనగానే చిలుక వెళ్ళి (తరగతిగదిలో ఒకరివెంట ఒకరు పరిగెత్తాలి.) పావురాయిని పట్టుకొని పలకను తెచ్చి అమ్మాయికి ఇస్తుంది. అమ్మాయి ఇచ్చిన పండును తీసుకొని చిలుక, పావురాయి తో కలిసి సగం సగం తింటాయి.



సూచనలు : ఇదే విధంగా తాళంచెవి, ఎలుక ఏనుగు పాఠాన్ని తొడుగులతో పిల్లలచేత అభినయింపవచ్చు.

**పప్పెట్రీ రకం** : తొడుగులు,

**అంశం** : తెలుగు,

**సామర్థ్యం** : కధాగేయం

**పాఠం** : కోతిగౌను

**తొడుగులు** : కోతి, మనిషి





**ఇతర వస్తువులు** : దువ్వేన, పౌడరు, పైసలు, రైలు బొమ్మ (అట్టతో తయారు చేయించవచ్చు)

**కావలసిన వస్తువులు** : చార్ట్ పేపర్ లేదా పేపర్ ప్లేట్, జిగురు, దారం, రంగులు

**తయారీ విధానం** : చార్ట్‌ను గుండ్రగా కత్తిరించాలి. కావలసిన రంగు ను వేయించాలి. కోతి ముక్కు, చెవులు ఆకారంలో చార్ట్ పేపర్‌ను కత్తిరించి అంటించాలి. అలాగే మనిషి తొడుగు తయారు చేయాలి. దారంతో పిల్లల ముఖాలకు కట్టాలి.

**నిర్వహణ విధానం** : టీచరు మొదట గేయాన్ని పిల్లలకు వినిపించాలి . ఈ గేయాన్ని అభినయిద్దామా? అని వారిచేత తొడుగులు, కావలసిన ఇతర వస్తువులు సమకూర్చుకోవాలి. తొడుగులు వేసుకున్న పిల్లలు అభినయిస్తూ ఉంటే, టీచరు మిగిలిన పిల్లలు కలసి పాడాలి. (కోతి ప్రవేశం) (కోతి తన రెండు చేతులతో గౌను ను పట్టుకొని ఆటు ఇటు ఊగుతూండడం)

**టీచరు :** కోతి పుట్టినరోజంట! **పిల్లలు :** (పెద్దగా) ధాం ధాం ధాం

**టీచరు :** కొత్తగౌను వేసెనంట! **పిల్లలు :** (పెద్దగా) ధాం ధాం ధాం

(కోతి తన తలను దువ్వెనతో దువ్వుకోవడం లేదా నటించడం)

**టీచరు :** తలను చక్కగ దువ్వెనంట! **పిల్లలు :** (పెద్దగా) ధాం ధాం ధాం

(కోతి తన ముఖానికి పౌడరు పూసుకొవడం లేదా నటించడం)

**టీచరు :** పౌడరు తెల్లగ పూసెనంట! **పిల్లలు :** (పెద్దగా) ధాం ధాం ధాం

**టీచరు :** సైకిలెక్కి టౌనుకు వెళ్ళి! **పిల్లలు :** (పెద్దగా) ధాం ధాం ధాం

(కోతి సైకిలెక్కి వెళ్ళినట్టు నటించడం)

**టీచరు :** దారిలోన పైసలు దొరికె! **పిల్లలు :** (పెద్దగా) ధాం ధాం ధాం

(కోతికి దారిలోన పైసలు దొరికినట్టు నటించడం) (మనిషి ప్రవేశం)

**టీచరు :** పైసలు తెచ్చి సైదులు కిచ్చె! **పిల్లలు :** (పెద్దగా) ధాం ధాం ధాం

(కోతి పైసలు సైదులుకు ఇచ్చినట్టు నటించడం)

**టీచరు :** సైదులు ఇచ్చెరైలు బొమ్మ! **పిల్లలు :** (పెద్దగా) ధాం ధాం ధాం

(సైదులు కోతి కి రైలు బొమ్మ ఇచ్చినట్టు నటించడం)

**టీచరు :** సైకిల్‌పైన రయ్యిన వచ్చె! **పిల్లలు :** (పెద్దగా) ధాం ధాం ధాం

(కోతి సైకిలెక్కి వెళ్ళినట్టు నటించడం)

**టీచరు :** రైలు బొమ్మతో ఆడెనంట! **పిల్లలు :** (పెద్దగా) ధాం ధాం ధాం

(పిల్లలు అందరు కోతి గౌనును ఒకరి వెనక ఒకరు పట్టుకొని రైలు లాగా తరగతి గది ఆంతా తిరగడం)

**సూచనలు :** ఈ కథకు పొడిగింపు గా చుక్‌చుక్ రైలు వస్తుంది... ఆగినంక ఎక్కండి... అని పాడుతూ తరగతిగది ఆంతా తిరగడం

**కుందేలు తెలివి పాఠాన్ని కూడా ఇదేవిధంగా పిల్లల చేత ఆభినయింప చేయవచ్చు.**

---

**తరగతి** : రెండు

**పప్పెట్రీ రకం** : తొడుగులు

**అంశం** : గణితం

**సామర్థ్యం** : నాణెముల పరిచయం

**పాఠం** : ద్రవ్యం

**తొడుగులు** : రూపాయి , రెండు రూపాయిలు, 5 రూపాయిలు , పది రూపాయిలు

**కావలసిన వస్తువులు** : పాతకార్డులు, ఫెవికాల్, చార్ట్‌కాగితం, రంగులు, దారం.

**తయారీ విధానం** : చార్ట్ పైన అన్ని నాణెములు పిల్లలచేత రాయించి కావలసిన రంగులను వేయించాలి. దారంతో పిల్లల నడుములకు/ముఖాలకు కట్టాలి.

**నిర్వహణ విధానం** : టీచరు మొదట నాణెములు పిల్లలకు పరిచయం చేయాలి. పది రూపాయిలు రాజుగా చేసి పక్కన నిలబెట్టాలి. రూపాయిలు, పది తొడుగులు తుయారుచేసి ఒక గ్రూపుగా పిల్లలను వేరువేరుగా నిలబెట్టాలి. ఆ రూపాయిలు పది కలిపి తే పది రూపాయాలు ఆని, రెండు రూపాయిలు 5 కలిపితే పది రూపాయాలు ఆని, 5 రూపాయిలు, రెండు కలిపితే పది రూపాయాలు ఆని వివరించాలి.

**సూచనలు** : తరగతిలోని పిల్లలందరిని గ్రూపులుగా సమంగా విభజించి, అందరిచేత తొడుగులు తయారు చేయించి అందరిని భాగస్వాములను చేయవచ్చు.



**పప్పెట్రీ రకం** : స్టిక్ పప్పెట్లు

**అంశం** : గణితం

**సామర్థ్యం** : చతురస్రం, దీర్ఘచతురస్రం, వృత్తం అవగాహన

**స్టిక్ పప్పెట్లు** : చతురస్రం, దీర్ఘచతురస్రం, వృత్తం

**కావలసిన వస్తువులు** : పాతకార్డులు, ఫెవికాల్, చార్ట్‌కాగితం, రంగులు, దారం.

**తయారీ విధానం** : చార్ట్ పైన అన్ని ఆకారాలు పిల్లలచేత రాయించి కావలసిన రంగులను వేయించాలి.

**నిర్వహణ విధానం** : టీచరు మొదట ఆకారాలు పిల్లలకు పరిచయం చేయాలి.
టీచరు-పిల్లలూ! మీరు వివిధ ఆకారాలు చూచేఉంటారు. వాటిలో అవి నేను గొప్ప! నేను గొప్ప! అని పోట్లాడుకుంటున్నాయి. వాటి మాటల్లో విని, ఎవరు గొప్పో ? మీరే చెప్పండి.

**వృత్తం పాట** : వృత్తం నండి నేను గుండ్రంగా ఉంటాను
నేనొక సంవృత పటాన్ని అంచులు లేనిదాన్ని
రూపాయి నాలాగుంటాది, బంతులు నాలాగుంటాది ॥వృత్తం నండి॥
నేను వృత్తాన్ని నేను గుండ్రంగా ఉంటాను. రూపాయి, బంతి, అన్ని నాలాగ ఉంటాయి. నాలాగా ఎవరుండరు. కాబట్టి నేనే గొప్ప.

**చతురస్త్రం** : ఆగాగు! వృత్తమా ఏమిటి నీ గొప్ప?. భూమిపై విసిరితే ఒక్కచోట నిలబడవు దొర్లుతావు. నేనెవరో తెలుసా?


**పాట** : చతురస్రాన్ని నేను చతురస్రాన్ని నేను
నాలో భుజాలు నాలుగు సమానం
మూలలు నాలుగు నాలో సమానం
నాలో పొడవు వెడల్పులు సమానం ॥చతురస్త్రం నండి॥
నేను చతురస్రాన్ని, నాలో నాలుగు మూలలు ఉంటాయి. ప్రతి మూల $90^0$ కోణంలో ఉంటాయి. నాలో నాలుగు భుజాలుంటాయి. అన్ని భుజాలు సమానం, నాలాగా ఎవరుండరు. కాబట్టి నేనే గొప్ప.

**త్రిభుజము పాట** : ఆగాగు చతురస్రమా ఏమి నీగొప్ప?
త్రిభుజాన్నండి నేను మూడు భుజాలున్నదానను
నాలో ఉన్నవి అల్ప కోణాలు ॥త్రిభుజాన్నండి॥
నాలో ఉన్నవి మూడు మూలలు నేను త్రిభుజాన్ని, నాలో మూడు మూలలుంటాయి.

| | | |
|---|---|---|
| **తరగతి** | : | మూడు |
| **పప్పెట్రీ రకం** | : | స్టిక్ పప్పెట్లు |
| **అంశం** | : | పరిసరాలవిజ్ఞానం |
| **సామర్థ్యం** | : | వృద్ధుల దినోత్సవం,వృద్ధులను గౌరవించడం. |
| **పాఠం** | : | కుటుంబం |
| **స్టిక్ పప్పెట్లు** | : | చిన్ని ,తల్లి, తండ్రి , దొంగ .నానమ్మ |
| **కావలసిన వస్తువులు** | : | పాతకార్డులు, ఫెవికాల్, చార్ట్‌కాగితం, రంగులు, దారం. |
| **కావలసిన ఇతర వస్తువులు** | : | స్కూలు బ్యాగు, గుమ్మం-2 (అట్టతో తయారుచేయించవచ్చు) కారం కవరు, కర్ర. చాకు. |
| **తయారీ విధానం** | : | కావలసిన వస్తువులు: ఫెవికాల్, రంగులు, వెదురుబద్దలు, దళసరిచార్ట్ కాగితం, కత్తెర. |


బొమ్మలలో చూపిన విధంగా చిన్ని, తల్లి, తండ్రి, దొంగ. నమూనా బొమల్మను డ్రాయింగ్‌గా వేసుకోవాలి. చార్ట్‌ను రెండుగా మడతపెట్టి అవుట్ లైన్ వెంట సరిగ్గా కత్తిరించాలి. తగిన రంగులను వేసిన తరువాత చేతులను బొమ్మలో చూపిన విధంగా కత్తిరించి కుట్టాలి. ఆ తరువాత చేతులకు వెదురుబద్దలు అంటించాలి. బొమ్మ ఉన్న సైజుకన్నా రెట్టింపు పరిమాణంలో బద్దనుకాని కాగితంను రోల్ లాగా చుట్టి ఫెవికాల్‌తో చార్ట్‌కు ఒక వైపున అంటించాలి. రంగు ఆరిన తరువాత కాళ్ళు, నోరు పెయింట్ చేస్తే బొమ్మ తయారవుతుంది.

ఇదేవిధంగా అన్ని బొమ్మలూ తయారుచేసుకోవాలి. తరువాత ఈ క్రింది విధంగా  కథ ను ముగ్గురు లేదా నలుగురు పిల్లలచేత తగిన విధంగా బొమ్మలను ఆడిస్తే పిల్లలు బాగా ఆనందిస్తారు. స్టిక్ పప్పెట్‌ను ఆడించే విధానం స్టిక్ పప్పెట్ల స్టేజి ప్రత్యేకమైన పెద్ద స్టేజి అవసరం లేదు. ఒక చేత్తో బొమ్మకు ఉన్న స్టిక్‌ను పట్టుకొని మరో చేత బొమ్మ చేతికి ఉన్న స్టిక్‌ను కదుపుతూ ఆడించాలి. మిగిలిన బొమ్మలకు ఉన్న స్టిక్‌ను అటూ ఇటూ మాతలకు అనుగుణంగా కదిపితే పిల్లలు ఆనందిస్తారు. చక్కగా ఆడిస్తారు.









## నిర్వహణ విధానం

**సీన్ నెం: 1 : టైమ్ :** ఉదయం 8.50గం॥లు **లొకేషన్ :** ఇంటిలో

చిన్ని, తండ్రి పుస్తకాలు పట్టుకుని స్టేజి కి ఒక పక్క ని నిలబడి ఉంటాడు. చిన్ని, స్టేజికి ఇంకో పక్కనుండి వచ్చి తండ్రిని చూసి

**చిన్ని :** నాన్న.....! నాన్న.....! మనం సెలవులకు నానమ్మ వాళ్లింటికి ఎప్పుడు వెళ్దాం?

**తండ్రి :** అరే... చిన్నీ...! నీకు చెప్పలేదు కదా!.... నిన్న నానమ్మ ఫోను చేసింది. సాయంత్రం నానమ్మ మనింటికి వస్తోంది. ఇక మీదట నానమ్మ మనతోనే ఉంటుంది.

**చిన్ని :** నానమ్మ ....? మనింటికా...? ఇక ఎప్పటికి మనతోనే ఉంటుందా?.... (తల్లి ప్రవేశం....)

**తల్లి :** అవును చిన్ని... ఇక ఎప్పటికి నానమ్మ మనతోనే ఉంటుంది....మేము ఆఫిస్ కు వెళ్లినా నీకు తోడుగా ఉంటుంది. ఇద్దరు కలసి నీ గదిలోనే పడుకొండి. రోజా రాత్రి పూట నీకు మంచి మంచి కథలు చెప్తుంది...

**చిన్ని :** నా గదిలోనా...?

**తండ్రి :** అవున్రా తల్లీ.... నీ గదిలోనే....

**చిన్ని :** నానమ్మ మనతోనే ఉండడం వరకు ఒకె... కాని నా గది ఇవ్వను....

**తల్లి :** అదిగొ... అలా అనొద్దు... నానమ్మ తొ సర్దుకోవాలి... సాయంత్రం నువ్వు స్కూల్ నుంచి వచ్చి నీ రూమే అంతా నీట్‌గా సర్దాలి. నానమ్మ కు తన సామాను సర్దుకోవటంలో హెల్ప్‌చేయాలి. నేను సాయంత్రం నానమ్మ ను స్టేషన్ నుండి తీసుకొని వస్తాను. తన కోసం సెలవు ఆఫీసుకు పెట్టాను.

**తండ్రి :** నానమ్మ వచ్చాక ఆమెను ఇబ్బంది పెట్టకూడదు. సరేనా...

**చిన్ని :** ఆ.. అలాగే. (మనసులో – అబ్బా నానమ్మ వాళ్ళింటికి మనం వెళ్తే బాగుంటుంది. కాని ఆమె ఇక్కడికి వస్తే ఏం బాగోదు – అనుకుంటూ స్కూల్‌కి వెళ్లిపోతుంది.) స్కూల్ నుంచి వస్తూ –

**సీన్ నెం: 2**

**చిన్ని :** రోజూ అమ్మా నాన్న ఆఫీసు నుంచి వచ్చేదాకా కంప్యూటర్ గేమ్స్ ఆడుకునే దాన్ని. ఈరోజు నుంచి నానమ్మ ఉంటుంది. అవన్నీ కుదరవేమో..

**నానమ్మ:** (వచ్చి తలుపు తీసి ) అరే చిన్నీ వచ్చేసింది. ఏంటి తల్లి అంత చిక్కిపోయావే.. ఆ బ్యాగ్ నీకన్నా బరువు ఉన్నట్టుంది. ఎందుకురా, ఇంతలా చిక్కిపోయావే. పోయిన పండక్కు వచ్చినపుడు బాగానే ఉన్నావుగా. సరిగా తినటం లేదా?

**తల్లి :** కాస్త అలా అడగండి అత్తయ్య, పొద్దున్న, రాత్రి బతిమాలితే తినదు. మధ్యాహ్నం సంగతి దేవుడికే తెలియాలి.

**నానమ్మ:** మీరిద్దరూ ఆఫీసు హడావుడిలో పడి దాన్ని పట్టించుకోవట్లేదా?

**తండ్రి :** అసలు మా మాటా వింటే కదా, ఇంట్లో వండింది తింటేకదా అమ్మా! అస్తమానం బయటవి కొనిపెట్టమంటుంది. కొనిపెట్టకపోతే తిండి మానేస్తుంది. దానికి తోడు ఆ దిక్కుమాలిన కార్టూన్ ప్రోగ్రామ్ లు ఆ టి.వి లో....

**నానమ్మ :** చిన్ని, అమ్మ ఇంట్లో వండింది ఆరోగ్యానికి మంచిది కదా. అయిన నేను వచ్చానుగా, ఇక వీరి ఆట కట్టేసి, అన్నీ సెట్‌చేస్తాను.

**చిన్ని :** పో నానమ్మ, రాగానే నువ్వు కూడా వాళ్ళ గ్యాంగ్‌లో చేరిపోయావు. నీతో నేను మాట్లాడను.

**నానమ్మ :** నా చిన్ని కదూ, నిన్ను ఇంకేం అడగను. కాళ్లు చేతులు కడుక్కొని కాస్త తిను. మనం హాయిగా కబుర్లు చెప్పుకుందాం.

**సీన్ నెం: 3** (తెల్లవారుతుంది) నానమ్మకు బాయ్‌చెప్పి చిన్ని స్కూలుకి, చిన్ని తల్లితండ్రులు ఆఫీసుకు వెళ్ళిపోతారు. సాయంత్రం చిన్ని స్కూలు నుంచి వస్తుంది.

**నానమ్మ :** చిన్నీ వచ్చావా! రా.., త్వరగా ముఖం కాళ్లు చేతులు కడుక్కుని, రా. పాలు తాగి టిఫిన్ తిందువుగాని.

**చిన్ని :** వస్తా ఆగుఆగు నానమ్మ, ఇప్పుడు టి.వి లో నా ఫేవరేట్ షో వస్తుంది. అది చూసేదాకా నేను ఏపనీ చేయను.

**నానమ్మ:** ఆ టి.వి ఎక్కడకు వెళ్తుంది చిన్ని, ఆ చెమటకంపుతో ఎక్కువ సేపు ఉంటే ఆరోగ్యం పాడవుతుంది. ముందు షూస్ తీసేసి, ఫ్రెష్ అయి నీకు నచ్చినట్లే చెయ్యి. లే నాన్న.. మంచి దానివి కదూ..

**చిన్ని :** ఆగు నానమ్మ, నీకేం తెలియదు. 5 మినిట్స్...

**నానమ్మ:** చిన్ని ఇదిగో, ఇలా అయితే మీ అమ్మకు ఫోను చేస్తాను.

**చిన్ని :** (మనసులో చూస్తున్న పిల్లలతో) నానమ్మ మాఇంటికి రాకున్నా బాగుండేది

**నానమ్మ:** ఇదిగో ఈ టిఫిన్ తిని, పాలు తాగి హోం వర్క్ చేసుకో, సరేనా..

**చిన్ని :** హోం వర్క్ మమ్మీ వచ్చాక చేస్తాను నానమ్మ, నాకు పాలు వద్దు ఏం వద్దు.

**నానమ్మ:** అలా అంటే ఎలా తల్లి. సాయంత్రం పాలు తాగి, పండ్లో లేదా ఏదైనా తేలికపాటి ఆహారం తీసుకోవాలి. అప్పుడే ఆరోగ్యంగా బలంగా ఉంటారు.

**చిన్ని :** (మనసులో చూస్తున్న పిల్లలతో– నానమ్మ సోది ఆపేలా లేదు)

**నానమ్మ:** సరే, సరే నేను అలా దుకాణం దాక వెళ్తున్నా. కారం కొనుక్కోని వస్తాను.... గుమ్మం తలుపు మూసుకో... అసలే రోజులు బాగా లేవు. లోపలికి ఎవరైనా వచ్చేస్తే.

**చిన్ని :** (సంతోషంగా) అబ్బా, నానమ్మ వేస్తాలే. ముందు నువ్వెళ్ళు.
నానమ్మ .. తలుపు దగ్గరకు వేసుకో అంటూ... (నానమ్మ బయటకు వెళ్ళిపోతుంది)

**చిన్ని :** హమ్మయ్య నానమ్మ లేదు. నేను కాసేపు ఎంచక్కా....టి.వి చూడొచ్చు.....

(తెరిచి ఉన్న డోర్ లోంచి దొంగ ఇంట్లోకి జొరబడలేడు. ఇంట్లో చిన్ని ఒక్కతే ఉందన్న విషయం అతను గుర్తిస్తాడు. చాకుతో వచ్చి చిన్ని ని బెదిరిస్తాడు.

**దొంగ :** మర్యాదగా బీరువా తాళాలు ఎక్కడున్నాయో చెప్పు...

**చిన్ని :** (ఎడుస్తూ...) నాకు తెలియదు..నాకు తెలియదు.

**దొంగ :** ముందు ఆ నోరు ముయ్యి.... ఏడిస్తే వదిలేస్తా అనుకున్నావా? నేనంత అమాయికుడిని కాదు. మర్యాదగా తాళాలు ఎక్కడున్నాయో చెప్పు.

పద – చూపించు తాళాలు ఎక్కడున్నాయో.

(ఈలోపు షాపు నుంచి వచ్చిన నానమ్మ, దొంగను, చిన్ని ని గమనించి పరిస్థితి అర్థం చేసుకుంటుంది. దొంగచాటుగా అదునుకోసం నక్కి చూస్తు ఉంటుంది. బీరువా ఉన్న గదిలోకి వెళ్ళుతున్న దొంగను కర్ర తో తల మీద గట్టిగా కొడుతుంది...తిరిగిన అతని కళ్ళలో కారం కొడుతుంది నానమ్మ. దొంగ మంటతో చిందులు తొక్కుతుంటాడు.

**దొంగ :** అమ్మో– – అబ్బా? అబ్బ.

అప్పుడే చిన్ని కర్రతో బాదుతుంది... నేల మీద పడిపోయేలా చేస్తుంది. వెను వెంటనే నానమ్మ, చిన్ని ఆ దొంగను, ఆ గదిలో వదిలి బయిటకు వచ్చి గడి వసేస్తారు. పోలీసులకు ఫోను చేసి దొంగను పట్టిస్తారు.) తెలుగు ఎవరికి వారే గొప్ప చెట్టు కోరిక పాఠాన్ని కూడా ఇదేవిధంగా పిల్లలచేత ఆభినయింప చేయవచ్చు.

**తరగతి** : నాలుగు

**పప్పెట్రీ రకం** : స్టిక్ పప్పెట్లు/ వేలు (ఫింగర్) పప్పెట్లు

**అంశం** : పరిసరాలవిజ్ఞానం

**సామర్థ్యం** : పెంపుడు జంతువులు, అడవి జంతువుల పరిచయం

**పాఠం** : మొక్కలు జంతువులు


**పాత్రలు** : పెంపుడు జంతువులు ; కోడి పిల్ల, ఆవు, మేక, కాకి, బాతు, పావురం, కోడి, అడవి జంతువులు

**కావలసిన వస్తువులు** : పాతకార్డులు, ఫెవికాల్, చార్ట్‌కాగితం, రంగులు

**తయారుచేయు పద్ధతి** : బొమ్మలో చూపిన విధంగా అన్ని బొమ్మలను చార్ట్ కాగితం పైన గీసుకొని కత్తిరించుకొని రంగులు వేయాలి. ఆ తరువాత మీ చూపుడు వేలు సరిపడే కార్డు ముక్కను రోల్‌లాగా మడతపెట్టి అతికించాలి. ఈ అతికించిన రోల్ బొమ్మపైన వెనుకవైపు అంటించి మీ రెండు చేతుకు తొడుక్కొని బొమ్మ సంభాషణకు తగినట్లుగా మాడ్యులేట్ చేస్తూ గొంతు మారుస్తూ కథను చెబితే పిల్లలు ఆసక్తిగా వింటారు.

**వేలు పప్పెట్ల స్టేజి** : వేలు పప్పెట్లు ఆడించడానికి ఏ విధమైన స్టేజి అవసరం లేదు. రెండు చేతుల చూపుడు వ్రేళ్ళకు రెండు బొమ్మలను తొడుక్కొని కథకు అనుగుణంగా బొమ్మలను మారుస్తూ, కథను టీచరు చెబితే పిల్లలు ఎంతో ఆసక్తిగా వింటారు

**సూచనలు** : బొమ్మలు వేయడం రాకుంటే పుస్తకంలోని బొమ్మలను జిరాక్స్ తీసుకొని, రంగులు వేసుకొని ఉపయోగించవచ్చు. ఈ బొమ్మలను స్టిక్ పప్పెట్లలో కూడా తయారుచేసి ప్రదర్శించవచ్చు. ఇదేవిధంగా తెలుగులో మిత్రలాభం, తోడేలు గర్వం, మానవసేవ ఆనే పాఠాలకి సంబంధించిన బొమ్మలను పిల్లలచేత తయారుచేయించి, వారి చేతనే ఆడింపచేయవచ్చు.





**తరగతి** : నాలుగు

**పప్పెట్రీ రకం** : స్టిక్ పప్పెట్లు/ వేలు పప్పెట్లు

**అంశం** : పరిసరాలవిజ్ఞానం

**సామర్థ్యం** : విటమినులు పరిచయం

**పాఠం** : మన ఆహారం

## డాక్టర్ కొక్కొరోక్కో

(డా. కొక్కొరోక్కో మెడలో స్టెతస్కోపు అని బోర్డు ఉంటుంది. చిన్నా పెద్దా జంతువులన్నీ చూడు చూడుమని చుట్టు చేరతాయి.)

**కోడిపెట్ట** : డాక్టరుగారూ ఓ డాక్టరు గారూ
నేనండీ శ్రీమతి కోడి.....
చూడండీ నా పిల్లలు వీళ్లే
మొన్నటి వరకు ఊలు బంతిలా
ఉన్నారండీ వీళ్లంతా
ఇదిగో ఇటు చూడండీ...
వణికే కాళ్లూ చూశారా ?
అయ్యో ఇక మీరే దిక్కు
ఏమి దారి నాకయ్యా డాక్టర్? // డాక్టరు//

**డాక్టరు** : అన్ని పరీక్షలు చేశానమ్మా
ప్రమాదం ఇది బెరి బెరి జబ్బు
భయపడకమ్మా ఓ కోడి
నయమౌతుంది బెరిబెరి
ఇది బి విటమిన్ లోపం
ఆహారంలో మార్పులు చేస్తే సరి
పారిపోవును బెరి బెరి బెరి బెరి // డాక్టరు//

**తరగతి** : 5

**పప్పెట్రీ రకం** : స్టిక్ పప్పెట్లు

**అంశం** : జీవన నైపుణ్యం - విలువైన జీవితం

**సామర్థ్యం** : విలువలు, సహేతుకంగా ఆలోచించడం. నీతి-నిజాయితీ. ఆత్మవిశ్వాసం. శ్రద

**కథ** : భూతం నేర్పిన పాఠం

**స్టిక్ పప్పెటుపాత్రలు** : భూతం, మనిషి

**కావలసిన వస్తువులు** : ఫెవికాల్, రంగులు, వెదురుబద్దలు, దళసరి చార్ట్ కాగితం, కత్తెర.

**తయారీ విధానం** : బొమ్మలలో చూపిన విధంగా భూతం,మనిషి నమూనా బొమల్మను డ్రాయింగ్‌గా వేసుకోవాలి. చార్ట్‌ను రెండుగా మడతపెట్టి అవుట్ లైన్ వెంట సరిగ్గా కత్తిరించాలి. తగిన రంగులను వేసిన బొమ్మ ఉన్న సైజు కన్నా రెట్టింపు పరిమాణంలో బద్దను కాని కాగితం ను రోల్‌లాగా చుట్టి ఫెవికాల్‌తో చార్ట్‌కు ఒక వైపున అంటించాలి. భూతం బొమ్మ ను మనిషి కన్నా రెట్టింపు పరిమాణంలో తయారుచేయాలి.

తరువాత ఈ క్రింది విధంగా కథను ఇద్దరు ఆడిస్తూ, ఇద్దరు లేదా నలుగురు పిల్లలచేత తగిన విధంగా పాట పాడుతూ బొమ్మలను ఆడిస్తే పిల్లలు బాగా ఆనందిస్తారు.

టీచర్; చిన్నారి బాలలూ... మనిషి జీవితం ఎంతో విలువైనది. తలచుకుంటే మనిషి ఎన్ని గొప్ప పనులైనా చేయగలడు. మీకు తెలుసు కదా... మానవుడు తన బుద్ధిని ఉపయోగించి ఎన్నో అద్భుతమైన సాధనాలు కనిపెట్టాడు. రాకెట్లో చంద్రమండలానికి కూడా వెళ్లొచ్చాడు!... ఐతే, కొంతమంది మనుషులుంటారు. పాపం... వాళ్లు ప్రతి చిన్న సమస్యకు నిరాశపడిపోతుంటారు. ఏదైనా కష్టం ఎదురైతే, చాలా బాధపడిపోతుంటారు. తమ జీవితం ఇలా అయిపోయిందనే అని ఏడుస్తూ కూచుంటారు. అలాంటివాడే నిరుద్యోగి నిరంజనం. అతనికి ఓ భూతం ఎలా బుద్ధి చెప్పిందో - ఆ గమ్మత్తయిన కథేమిటో 'విలువైన జీవితం' బొమ్మలాటలో చూద్దామా...

**నిరుద్యోగి నిరంజనం పాట :**

**పల్లవి** : నిరుద్యోగినండీ బాబూ. నిరుద్యోగినండీ

**చరణం** : పనిచేయాలని ఉన్నా... ఎవరూ నా మొక వినరన్నా..
నిలువ నీడ లేదన్నా... ఇది విలువలేని బతుకన్నా ॥ నిరుద్యోగి ॥

**వచనం** : ఉద్యోగం కోసం నేను ఎన్ని కష్టాలు పడ్డానో...

**పాట** : తూరుపు వెళ్తే - ఉత్తరమేదన్నారు.....
పడమర వెళ్తే - దక్షిణం ఏదన్నారు ॥ నిరుద్యోగి ॥

**వచనం** : ఉత్తరం వైపు, దక్షిణం వైపూ వెళ్లానండీ. అప్పుడందరూ తూరుపు తిరగి దణ్ణం పెట్టమన్నారు... హు... ఉద్యోగం లేని నా బతుకెందుకు... వృథా... అందుకే నేను చచ్చిపోవాలి. అడవికి వెళ్తే అక్కడ ఏ జంతువుకైనా ఆహారమైపోవచ్చు. ఆ... అదిగో... అడవి ఆహా... జంతువులన్నీ ఈ అడవిలో ఎంత ఆనందంగా

తిరుగుతున్నాయి.. అదిగో మృగరాజు సింహం... పులి... ఏ జంతువు అయిన నన్ను తింటది... హు... సింహం... పులి కూడా నన్ను వదిలేసింది. నేను మనుషులకే కాదు... ఈ జంతువులకు కూడా లోకువైపోయాను. సరే... ఆ చెట్టు దగ్గరకెళ్తాను. ఆ చెట్టుమీద ఏ భూతమైనా ఉంటే... నన్ను చంపుకు తినేస్తుంది కదా... ఓ భూతమా... రా... నీ ఆకలి తీర్చడానికి నే వచ్చాను... రా!

**భూతంపాట:** **పాటకు ముందు వచనం :** "అహ్హహ్హా.. అహ్హహ్హా. నా చెట్టు నీడలోనికి ఒక
నరుడా.. దుస్సాహసం.. దుస్సాహసం.
ఎవడివిరా ఓ నరుడా ? నువ్వెవడివి రా... వానరుడా ?.....
కాకులు దూరని కారడవి చీమలు దూరని చిట్టడవి
నువ్వెలా దూరావు నరుడా.?? ఎవడివిరా నరుడా ??
నువ్వెవడివిరా... వానరుడా ॥??

**నిరుద్యోగి :** నేనెవరో, ఎలా వచ్చానో నీకెందుకుగాని ముందు నన్ను చంపేసి, నీ ఆకలి తీర్చుకో...

**భూతం :** ఆ... ఎవణ్ణిబడితే వాణ్ణీ చంపేయడానికి నేను చెడ్డభూతాన్ని కాదురా.. మంచిభూతాన్ని... చెప్పు... నీ కష్టం ఏమిటో... నేను సాయం చేస్తా.

**నిరుద్యోగి :** ఏమిటీ... నువ్వు మంచి భూతానివా.. ఆశ్చర్యంగా ఉందే... సరే... చెప్తాను... నాకు ఉద్యోగం దొరక్క కష్టాల్లో మునిగిపోయాను. బతుకుమీద విసుగొచ్చి, చావాలనుకున్నాను. ఇప్పుడు నేను బతకాలంటే, డబ్బు కావాలి.

**భూతం :** అర్భకుడా... డబ్బు వూరికే ఎలా వస్తుందనుకున్నావురా. నీ దగ్గర బోలెడంత ఆస్తి ఉందికదా... దాన్ని అమ్ముకుని బతకొచ్చు కదా!

**నిరుద్యోగి :** నా దగ్గర ఆస్తిఉందా... ఏముంది బూడిద...

**భూతం :** బూడిద కాదురా గాడిదా...

పాట : ఇస్తావా నీ... కళ్లు ... మిలమిలమెరిసే కళ్లు...విలువైన బంగారు కళ్లు ...
నీ కళ్లకు నాధర లక్ష..... ఆ డబ్బేరా నీకు శ్రీరామరక్ష ॥ఇస్తావా॥

**నిరుద్యోగి :** ఆ... కళ్లు తీసి ఇవ్వాలా పాపం... కళ్లులేని బతుకే ఒక శాపం ॥కళ్లుతీసి॥
అందమైన లోకాన్ని చూసేవే కళ్లు... కళ్లేగా నా పాలిటి బంగారు వాకిళ్లు ॥కళ్లుతీసి॥

**భూతం :** సరే... నీ కళ్లు నీదగ్గరే ఉంచుకో...

**భూతంపాట:** ఇవ్వు... ఇవ్వు... ముచ్చటైన... కాళ్లు నీ కాళ్లకు నేనిస్తా రెండు లక్షలు ॥ఇవ్వు॥

**నిరుద్యోగిపాట:** కాళ్లుంటేనే కదా నడకలేదంటే, వేయాలి పడక ఇవ్వనంటే ఇవ్వను... అసలివ్వను నాకాళ్లకు మొక్కుతా... అసలివ్వను॥ కాళ్లుంటేనే ॥

**భూతంవచనం:** ఐతే, కాళ్లుకూడా ఇవ్వవన్నమాట... సరే!

**పాట** నీ చేతులున్నాయి చూడు వాటి ఖరీదు మూడు... మూడు లక్షలు ఇచ్చేస్తా...
నీ రెండు చేతులూ తీసేస్తా... ॥నీ చేతులున్నాయి॥

**నిరుద్యోగివచనం :** వద్దు బాబోయ్ వద్దు...


**పాట** : చేతులతోనే చేతలు నా బతుకును నడిపే రాతలు
చేతులుంటే అన్నం తింటూ... లేకుంటే, ఈ బతుకే తంటా! ॥చేతులతోనే॥

**వచనం** : ఇవ్వను నాచేతులు నీకివ్వను

**భూతం (వచనం)** : నీ కళ్ల ఖరీదు లక్షన్నాను. కాళ్ల ఖరీదు రెండు లక్షలన్నాను. చేతులకు మూడు లక్షలు ఇస్తానన్నాను ఇవ్వనన్నావు. లక్షలకు లక్షల విలువైన అవయవాలు, బుద్ధి నీకున్నాయి. అయినా, నీ జీవితానికి విలువలేదనుకుని, చావాలనుకుంటున్నావు. ఇప్పుడైనా నీ విలువెంతో తెలుసుకున్నావా! వాటిని తెలివిగా ఉపయోగించి, బతకాలి. అందరూ ఉద్యోగాలే చేయాలా? కష్టపడి, న్యాయంగా ఏ పనైనా చేసి, బతకొచ్చు.ఇంకెప్పుడూ చచ్చిపోవాలని ఆలోచించకు... వెళ్లు... కష్టపడి సంపాదించి మంచి పేరు తెచ్చుకో...

**నిరుద్యోగి** : భూతమా... నువ్వు నా కళ్లు తెరిపించావు... నిజంగా నువ్వు మంచి భూతానివే... ఇప్పుడునాకు అర్థమైంది... మనిషి బతుకెంత విలువైనదో... వెళ్తొస్తా... ఆ...ఆ... ఇంకెప్పుడూ ఇక్కడికి రాను... నీ మాటలు మాత్రం నేనెప్పుడూ గుర్తుంచుకుంటాను.

**నిరుద్యోగిపాట:** కళ్లున్నాయి... కాళ్లున్నాయి
చక్కని చేతులు రెండున్నాయి
ఇక కాయకష్టమూ చేసేస్తా...
హాయిగా సిరులు పండిస్తా



# సంగీతం

పాట మనిషికి ప్రాణం వంటిది అంటారు. సంగీతం మనుషులను, పశుపక్ష్యాదులను ఆనందంలో ఓలలాడిస్తుందని కూడా అంటారు. సంగీతానికి పెద్ద, చిన్న వయోభేధాలేమీ ఉండవు. జీవితంలో పాటపాడని మనిషే ఉండడట. పాట విని పరవశించని వారిని బండరాయితో పోలుస్తుంటారు. మనలోని సంతోషం, బాధ, కోపం మొదలైన భావాలన్నింటినీ రాగయుక్తంగా పాటరూపంలో వ్యక్తపరుస్తుంటారు.

పాఠశాలలో చేరిన పిల్లలు మొదలుకొని ఎవరైనాసరే పాట పాడడానికి పాడేవారితో గొంతు కలపడానికి ఆసక్తిని ప్రదర్శిస్తారు. అందువలనే ప్రాథమికస్థాయిలో విద్యలో పాటలకు అంత్యంత ప్రాధాన్యత కల్పించారు. ఇందుకోసం ఉపాధ్యాయుడు ఒకటవ తరగతినుండే పిల్లలకు అభినయగేయాలు నేర్పాలి. అదేవిధంగా పాఠ్యపుస్తకాలలో ఉండే గేయాలకు రాగం కూర్చి పిల్లలతో పాడించాలి. పిల్లలందరూ పాఠశాలలోని అన్ని తరగతులలో ఉండే గేయాలను పాడవచ్చు. దీనితో తరగతి అంతరాలు అంతగా ఆటంకం కలిగించవు. మూడోతరగతి పిల్లలు సైతం ఐదో తరగతి పాటలు పాడడానికి ఆసక్తిని ప్రదర్శిస్తారు.

పాట నేర్పడం ఎలా ?

- పాట నేర్పడానికి ముందు పాటను పాడిగానీ, సి.డి. ద్వారాగానీ వినిపించాలి.
- పాట గురించి పిల్లలతో చర్చించాలి. భావాన్ని వివరించాలి.
- ముందుగా పల్లవిని తరువాత చరణాన్ని నేర్పాలి.
- పాటమొత్తం ఒకేసారి కాకుండా ఒక చరణం తరువాత మరొకటి నేర్పాలి.

పాఠ్యపుస్తకంలోని గేయాలకు స్వరం చేకూర్చి మార్కెట్‌లో దొరికే సి.డి.లు, క్యాసెట్‌లు కూడా ఉపయోగించవచ్చు. అదేవిధంగా పిల్లలు సొంతంగా నేర్చుకున్న సినిమాపాటలు, జానపదగేయాలు కూడా పాడించాలి. గ్రామంలో ఉండే పాట పాడేవారిని బడికి ఆహ్వానించి వారిచే నేర్పించాలి.

ఐదవ తరగతి పూర్తయ్యేసరికి పిల్లలు కనీసం 20 పద్యాలు, 10 శ్లోకాలు, 10 పాటలు పాడగలిగి ఉండేలా ఉపాధ్యాయుడు కృషిచేయాలి.

(శాస్త్రీయ సంగీతాన్ని సి.డి. ద్వారా లేదా స్థానికంగా ఉండే సంగీత ఉపాధ్యాయుని సమక్షంలోనే సాధన చేయాలి.)

